క్లుప్తంగా

విద్యార్థినులు వ్యక్తిగతశుభ్రత పాటించాలి



రజాపురంలో విద్యార్థినులకు చికిత్స అందిస్తున్న వైద్యులు

గుత్తి రూరల్: విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు దేవేంద్రనాయక్, ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని రజాపురం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం మూడో రోజు వైద్యులు వైద్య శిబిరం నిర్వహించారు. కలుషిత నీటిని తాగి అస్వస్థతకు గురైన విద్యార్థినులకు వారు చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా వారు తరగతి గదులకు వెళ్లి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థినీ తప్పకుండా మరుగుదొడ్లను వినియోగించుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయడం వలన వ్యాధులు ప్రబలుతాయన్నారు. రోజూ భోజనం చేసే ముందు తప్పకుండా చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. చేతి గోళ్లను కత్తిరించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది లాజరస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పట్టాల కోసం ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తాడిపత్రిటౌన్: ఇంటి పట్టాల కోసం పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన దళితులు, కొంత మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. వారు మాట్లాడుతూ స్థానిక యల్లనూర్ సమీపంలోని చల్లవారిపల్లి వద్ద సర్వే నెంబర్ 123 ఎ లో ఉన్న 3 ఎకరాల్లో తాము ఏర్పాటు చేసుకున్న కొట్టాలు, బండల రూంలను, గంగమ్మ అమ్మవారి గుడిని ఇద్దరు వ్యక్తులు కూల్చివేశారన్నారు. అధికారులు వారిపై చర్యలు తీసుకుని.. ఆ స్థలంలో పేదలకు పట్టాలు పంపిణీ చేయాలన్నారు. లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, రంగమ్మ, యశోదమ్మ, ఓబులమ్మ, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

నేడు పన్నుల వసూళ్లకు వేలం

పామిడి: పామిడి గ్రామ పంచాయతీకి సంబంధించి 2024, జూలై 1 నుంచి 2025, మార్చి 31 వరకూ ఆదాయ వనరులైన పంచాయతీ పన్నుల వసూళ్ల హక్కుకు శనివారం ఉదయం 11 గంటలకు కార్యాలయ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈఓ పీ చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. దినసరి మార్కెట్, బస్టాండ్, జంతు వధశాల సుంకపు వసూళ్ల హక్కుకు వేలం ఉంటుందన్నారు. వేలం లో పాల్గొనేవారు దినసరి మార్కెట్, బస్టాండ్‌కు రూ.50 వేల చొప్పున, జంతువధశాలకు రూ.20 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. ఈ పనులకు అదనపు ధరావత్తు ప్రతి లక్షకు దినసరి మార్కెట్, బస్టాండ్‌కు రూ.50 వేల చొప్పున, జంతువధశాలకు రూ.10 వేలు ప్రకారం చెల్లించాలన్నారు.అవకాశాన్ని పంచాయతీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

2న ప్రజావేదిక

గార్లదిన్నె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జూలై 2న సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 30 వరకూ ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులను సోషల్ ఆడిట్ బృందం సభ్యులు ఈనెల 19 నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తారన్నారు. అలాగే గ్రామసభలు ఏర్పాటు చేస్తారన్నారు. అందులో భాగంగా జూలై 2న ఎంపీడీఓ కార్యాలయంలో 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి

బుక్కరాయసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థులకు పాటు నాణ్యమైన బోజనం వడ్డించాలన్నారు.అనంతరం పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు నవీద, లింగానాయక్, ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, పసుపుల హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడుకోనిద్దాం...ఆరోగ్యాన్నిద్దాం

- ఆటపాటలతోనే చక్కటి ఆరోగ్యం
- సెల్‌ఫోన్, కంప్యూటర్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని నిపుణుల సూచన



యాడికి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఎక్సైజ్ సైజ్ చేయిస్తున్న దృశ్యం

యాడికి: ప్రస్తుత ఆధునిక జీవన విధానంలో శారీరక శ్రమకు దూరమైన అనేక మంది 30 ఏళ్లకే అనారోగ్యం కొనితెచ్చుకుంటున్నారు. పాఠశాల స్థాయిలో ఎక్కువ సమయం ఆటలకు కేటాయిస్తే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. పిల్లలు బాల్యపు తీపి అనుభవాలకు దూరంగా సెల్‌ఫోన్, కంప్యూటర్‌లో ఆటల వైపు మొగ్గు చూపడం మంచిది కాదని చెబుతున్నారు. చక్కగా ఆడుకున్న విద్యార్థులు చదువులోనూ ముందంజలో ఉంటున్నారని సర్వేలు చెబుతున్నాయి. తాడిపత్రి నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కొన్ని పాఠశాలలకు ఆటస్థలాలు సరిగ్గా లేనప్పటికీ కూడా ఉన్న కొద్ది పాటి స్థలాన్ని వినియోగిస్తున్నారు. ఆటపాటలతోనే చక్కటి ఆరోగ్యం సొంతమవుతుందని వైద్యులు చెబుతున్నారు.

వ్యాయామంతో మానసికోల్లాసం

ఆటలతో పాటు రోజూ గంట వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుంది. ఆలోచన సామర్థ్యం కూడా పెరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ చూపిస్తూ ఉదయం, సాయంత్రం వేళల్లో వీలైతే జిమ్‌లకు వెళ్లడం, యోగా, సైక్లింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రస్తుతం జీవన విధానంలో వచ్చిన మార్పులు కారణంగా జనాభాలో అధిక శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, యువత అధిక బరువు కారణంగా చిన్న వయస్సులోనే వ్యాధులు బారిన పడుతున్నారు. ఫాస్ట్‌ఫుడ్, కేక్‌లు, పిజ్జాలు, బర్గర్‌లు, చాట్స్ వంటి జంక్ ఫుడ్స్‌ను అధికంగా తీసుకుంటుండటం అధిక బరువుకు కారణమవుతోందని వైద్యులు చెబుతున్నారు. బరువు తగ్గేందుకు రోజూ ఆటలు ఆడడంతోపాటు వాకింగ్ చేయాలని వారు సూచిస్తున్నారు.

ఆటలతో సరదా...



విద్యార్థి దశలో ఆటలు సరదాను నింపుతాయి. శారీరక, మానసిక, ఆరోగ్యానికి బాటలు వేస్తాయి, ఆటల్లో జట్టుగా ఏర్పడటం ద్వారా సామాజిక సంబంధాలు మెరుగవుతాయి. అందుకే పిల్లలను ఆడుకోనివ్వాలి.

– కాశెప్ప, ఎంఈఓ

సామర్థ్యం పెంపు



విద్యార్థుల్లో సామర్థ్యం పెంపునకు ఆటలు దోహద పడతాయి. మైదానాల్లో పరుగు తీయడం, ద్వారా సమస్యలకు ఎదురు నిలిచి పోరాడేతత్వం అలవడుతుంది. నిత్యం కొంత సమయం పరుగుకు కేటాయిస్తే మంచిది.

–నాగార్జునరెడ్డి, యాడికి అప్ గ్రేడ్ పీఎస్ సీఐ

చదువొక్కటే కాదు



తల్లిదండ్రులు పోటీపడి పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారు. చదువు ఒక్కటే ప్రధానం కాదు. ఖాళీ సమయంలో ఆటలు ఆడాలి. తద్వారా పిల్లల్లో శారీరకంగా, మానసికంగా దృఢత్వం ఏర్పడుతుంది.

–అప్పయ్య, ప్రభుత్వ వైద్యుడు రాయలచెరువు పీహెచ్‌సీ

ఎస్‌ఆర్‌ఐటీలో నేడు స్నాతకోత్సవం

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో శనివారం ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో రెండో స్నాతకోత్సవం (ఉద్భవాన్–2024) నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేఎన్‌టీయూ ప్రొఫెసర్ శివకుమార్, కళాశాల చైర్‌పర్సన్ జొన్నలగడ్డ పద్మావతి, కరెస్పాండెట్ ఆలూరు సాంబశివారెడ్డి హాజరవుతారన్నారు. 2024లో బీటెక్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు వీసీ పట్టాలను అందజేస్తారన్నారు. అలాగే బీటెక్ నాలుగు సంత్సరాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆలూరు నారాయణమ్మ స్మారక బంగారు పతకాలను అందజేస్తారన్నారు. కార్యక్రమానికి కళాశాల విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

‘ఎన్నికల అలవెన్స్ ఇవ్వాలి’

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల విధులు నిర్వహించిన సచివాలయ ఉద్యోగులకు ఎన్నికల అలవెన్స్ ఇవ్వలేదు. గత మూడు మాసాల పాటు ఎన్నికల విధులు నిర్వహించినా పైసా కూడా అలవెన్స్ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో సచివాలయ ఉద్యోగులు వినయ్, రమేష్, స్టాన్లీ ప్రశాంత్ తదితరులు మాట్లాడుతూ మూడు మాసాల పాటు బీఎల్‌ఓలుగా ఇతరత్రా ఎన్నికల విధులు నిర్వహించామని, అయితే అలవెన్స్ ఇవ్వలేదన్నారు. మిగతా ప్రాంతాల్లో ఎన్నికల అలవెన్స్ ఇచ్చారన్నారు. ఒక్కొక్కరికి రూ. 27 వేలు ఎన్నికల అలవెన్స్ రావలసి ఉందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఎన్నికల అలవెన్స్ వెంటనే ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందజేయాలి



తాడిపత్రిలో మాట్లాడుతున్న కమిషనర్ రామ్మోహన్

తాడిపత్రి రూరల్: లబ్ధిదారులకు పింఛన్లను సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వెళ్లి అందించాలని కమిషనర్ రామ్మోహన్ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మునిసిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులను నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ జులై 1 నుంచి పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. పెన్షన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు.

గుత్తి రూరల్: మండల వ్యాప్తంగా జూలై 1న ఇంటింటికి వెళ్లి సామాజిక భద్రత పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ భారతి ఆదేశించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని సచివాలయ సిబ్బందితో వారు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జూలై 1న ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. పింఛన్ల పంపిణీ 1న సాయంత్రం లోపు దాదాపు పూర్తి చేయాలన్నారు. వేలిముద్రలు పడని వారి లబ్ధిదారుల ఐరిష్ తీసుకుని పింఛన్లను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది అబ్దుల్, రాజేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: లబ్ధిదారులకు జూలై 1న ఇళ్ల వద్దనే గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి తెలిపారు.శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, అధికారులతో పింఛన్ల పంపిణీపై సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 7,872 మంది పింఛన్‌దారులు ఉన్నారన్నారు. వీరికి ఈ నెల రూ. నాలుగు వేలతో పాటు రూ.మూడు వేలు కలుపుకొని రూ.7 వేలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శ్రీరాములు, సచివాలయ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ 1వ తేదీ సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ గోపీకృష్ణ సచివాలయ సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం లో పింఛన్ల పంపిణీ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 7,706 పింఛనదారులున్నారన్నారు. పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్లూరు: లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ అందించాలని ఎంపీడీఓ దస్తగిరి సూచించారు. శుక్రవారం ఆయన మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఉదయం 6 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. మండలవ్యాప్తంగా 5812 మంది పింఛన్‌దారులు ఉండగా 117 మంది సిబ్బందితో పింఛన్ల పంపిణీ చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

సచివాలయ కార్యదర్శులతో సమావేశం



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. జూలై 1న చేపట్టే పెన్షన్ల పంపిణీ కార్యక్రమంపై సచివాలయ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఒకటో తేదీనే లబ్ధిదారులందరికీ పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

మెటీరియల్ గది సీజ్



పుస్తకాలు ఉంచిన గదిని సీజ్ చేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: పట్టణంలోని నారాయణ కార్పొరేట్ స్కూల్‌లో మెటీరియల్ ఉంచిన గదిని శుక్రవారం ఎంఈఓ మస్తానప్ప సీజ్ చేశారు. పాఠశాల నిర్వాహకులు అక్రమంగా పుస్తకాలు, ఇతర మెటీరియల్ విక్రయిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ నాయకులు గుర్తించారు. వెంటనే వారు ఎంఈఓకు సమాచారమిచ్చారు. అక్కడకు చేరుకున్న ఎంఈఓ గదిని సీజ్ చేశారు.

అనాథ ఆశ్రమానికి విరాళం



నగదు అందజేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కొత్తూరులో ఉన్న స్వీట్ సేవియర్స్ అనాథ ఆశ్రమానికి శుక్రవారం దాతలు రూ.12 వేలు విరాళం అందజేశారు. పట్టణంలోని న్యూ సీపీఐ కాలనీకి చెందిన ట్రాన్స్‌కో ఉద్యోగి గోపాల్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రంగమ్మ, హరి, సునీల్ , అరవింద్ తదితరులు ఆశ్రమ నిర్వాహకులకు నగదు అందించారు. ఈ సందర్భంగా దాతలకు ఆశ్రమ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

యాడికి: మండలంలోని బోయరెడ్డిపల్లె సమీపంలోని పెన్నా కర్మాగారం కాలనీలో శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. కమలపాడు వీఆర్వో రామాంజులరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ జిల్లాకు చెందిన కురం మహేశ్వర రెడ్డి, పావని దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత 15 సంవత్సరాలుగా పెన్నా సిమెంట్ కర్మాగారంలో మహేశ్వర రెడ్డి డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కాగా శుక్రవారం సాయంత్రం డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన మహేశ్వర రెడ్డికి ఫ్యాన్‌కు వ్రేలాడుతూ భార్య కనిపించటంతో శోకసంద్రంలో మునిగిపోయాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

ఉరవకొండ: స్థానిక ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ తల్లి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సచివాలయం–1 సమీపంలో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలో భక్తులు దీపాలు పెట్టి అర్చనలు అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఉపసంచాలకుడు మద్దిలేటి

బుక్కరాయసముద్రం: రైతులు పంటలు సాగు చేసే సమయంలో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించు కోవాలని జిల్లా వనరుల కేంద్రం ఉప సంచాలకుడు మద్దిలేటి సూచించారు. శుక్రవారం మండలంలోని దయ్యాలకుంటపల్లిలో సాగుకు సమాయత్తంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు మట్టి నమూనాల పరీక్షలు చేయించు కోవడం వలన, వాటి ద్వారా వచ్చిన ఫలితాలు ఆధారంగా భూమిలో ఎరువులు వాడుకోవచ్చన్నారు. రైతులు అనవసరంగా రసాయన మందులు వాడకూడదన్నారు. వేరుశనగలో మిత్ర పురుగులు, శత్రు పురుగులు గుర్తించి తగు మోతాదులో రసాయన మందులు వాడాలన్నారు. రైతులు సకాలంలో మంచి విత్తనాలు ఎంచుకోవాలన్నారు. విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. తద్వారా అనేక సూక్ష్మ వ్యాధులు నశించిపోతాయన్నారు. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శైలజ, ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అధిక ఫీజులపై ఏఐఎస్ఎఫ్ ధర్నా



ఎంఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గుత్తి: పట్టణంలోని ఎంఈఓ కార్యాలయం వద్ద శుక్రవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు ధర్నా చేపట్టారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్, నియోజకవర్గ కోశాధికారి లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేయడంతో పాటు అధిక ధరలకు పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నా, అధిక ధరలకు పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నా చోద్యం చూస్తున్న ఎంఈఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు విజయ్, పట్టణ అధ్యక్షుడు ధనుష్, నాయకులు కిరణ్, మనోహర్, నరసింహ,మహేష్, సునీల్, సాయి, షాషావలి పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు తప్పకుండా హాజరు కావాలన్నారు.

పరిశుభ్రతపై అవగాహన కలిగించండి



యాడికిలో మురుగు కాలువలో దోమల మందు చల్లిస్తున్న మలేరియా యూనిట్ అధికారి శ్రీనివాసులు



గుత్తి మండలంలోని పి.ఎర్రగుడి ఎస్టీ కాలనీలో ట్యాంకు వద్ద శుభ్రం చేయిస్తున్న సర్పంచ్

యాడికి: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మలేరియా యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఆయన యాడికి సచివాలయం–5 పరిధిలోని కాలనీల్లో సందర్శించి మురుగు కాలువల్లో దోమల నివారణకు మందు పిచికారీ చేయించారు. ఎలాంటి చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చినా సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్సలు చేయించుకోవాలన్నారు. అత్యవసర సమయాల్లో 104, 108 వాహన సేవలను వినియోగించుకోవాలని కాలనీవాసులకు ఆయన వివరించారు. కార్యక్రమంలో సచివాలయ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పి.ఎర్రగుడిలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

గుత్తి రూరల్: మండలంలోని పి.ఎర్రగుడి గ్రామంలో సర్పంచ్ మోటా పాపన్న శుక్రవారం పారిశుధ్య పనులు చేయించారు. ఇటీవల డయేరియా వ్యాధి ప్రబలి ప్రజలు అస్వస్థతకు గురవుతున్న విషయం తెలుసుకున్న సర్పంచ్ ముందు జాగ్రత్తగా గ్రామంలో తాగునీటి ట్యాంకులు, డ్రైనేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి మురుగు రోడ్లపై ప్రవహిస్తుండటంతో కాలువలను శుభ్రం చేయించారు. ఓవర్ హెడ్ ట్యాంకుల్లో పూర్తిగా నీటిని తొలగించి పంచాయతీ సిబ్బందితో పాటుగా సర్పంచ్ స్వయంగా ట్యాంకులోకి దిగి బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రం చేయించారు. అలాగే గ్రామంలోని ప్రధాన రహదారుల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది సతీష్, గ్రామస్తుడు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

పామిడి: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అంగన్‌వాడీలు అవగాహన కల్పించాలని గుత్తి ఐసీడీఎస్ సీడీపీఓ డిల్లీశ్వరి సూచించారు. శుక్రవారం స్థానిక పామిడి సెక్టార్‌లోని కాల్వగడ్డ అంగన్‌వాడీ–1 కేంద్రంలో డయేరియాపై నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరైన తల్లులు, పిల్లలు, అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి సీడీపీఓ మాట్లాడారు. డయేరియా, మలేరియా, మెదడువాపు తదితర సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఈ వ్యాధుల లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కాచిన నీటిని త్రాతాగాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం డయేరియాను అరికట్టడంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలక్ష్మి, ఏఎన్ఎం మహేశ్వరి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.



పామిడిలో డయేరియాపై ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



విద్యార్థులకు బహుమతులందజేస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. శుక్రవారం రూరల్ పరిధిలోని సజ్జలదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు షకీలాబానుకు ప్రథమ బహుమతి కింద నగదు రూ. 5 వేలు, ద్వితీయ బహుమతి కింద ఇమాంసాహెబ్‌కు రూ.3 వేలు, తృతీయ బహుమతి బండారు సుమంత్‌కు రూ.2 వేల నగదును బహూకరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీ నరసింహులు, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి, సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.